క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులకు బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పగిద్యాల: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

బండిఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ దాసు ఆదివారం తనిఖీ చేశారు. ఫ్రీ హోల్డ్ అయిన అసైన్‌మెంట్ ల్యాండ్ రీ వెరిఫికేషన్ రికార్డులు పరిశీలించి వాటి నిర్వహణకు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్‌కు పలు సూచనలు చేశారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో కొలువైన స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులు పల్లకీలో ఆశీనులను చేసి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఏర్పాటు



గ్రామ కమిటీ సభ్యులతో నాయకులు

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ శాఖ కార్యదర్శిగా పెరుమాళ్ల సత్యరాజుతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ గ్రామంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం సూచించారు. సమావేశంలో మండల కార్యదర్శి స్వాములు, నాయకులు నాగేష్, ధర్మరాజు, రాజేష్, చిన్నయ్య, జి.దాసు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

కొత్తపల్లి: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని దుద్యాల గ్రామంలో రైతు సంఘం రాయకులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్ పక్కనే ఉన్న నందికుంట, బావాపురం, వీరాపురం, కొత్తపల్లె, దుద్యాల, జడ్డువారిపల్లె, గోకవరం, లింగాపురం గ్రామాల భూములకు సాగు నీరు ఇవ్వకపోవడం తగదన్నారు. సంగమేశ్వరం వద్ద బ్యాక్ వాటర్‌పై ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి మెట్ట భూములకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొనలేం..తినలేం!

- భగ్గుమంటున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు
- రోజురోజుకు పెరుగుతున్న వంట నూనెల సెగ
- ఆందోళన చెందుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు

సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఏం కొనేటట్టు లేదు.... ఏం తినేటట్టు లేదు. నిత్యావసర సరుకులతోపాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేదల జీవనం కష్టంగా మారింది. వంట నూనెల ధరలు సైతం రోజురోజు సెగ చూపుతున్నాయి. అయినా ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేష్టలుడిగి చూస్తుండటంతోపాటు వంద రోజుల వేడుకలను చేసుకుంటున్న తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హితవు పలుకుతున్నారు. – ఆత్మకూరు



సంతమార్కెట్‌లో కూరగాయలు

కేంద్ర, ప్రభుత్వాల నిర్వాకంతో వంట నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. 10 నుంచి 20 శాతం జీఎస్టీ పెంచడంతో వంటనూనెల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత ప్రభుత్వంలో పామాయిల్ లీటర్ రూ.85 నుంచి రూ.90 వరకు ఉండగా ప్రస్తుతం రూ.130 నుంచి రూ.135కు ఎగబాకాయి. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ.140కు పెరిగింది. వేరుశనగ నూనె లీటర్ రూ.140 నుంచి రూ.150 చేరింది. ఇక కందిపప్పు తాండూర్ రకం రూ.150 నుంచి రూ.160, వెల్లుల్లి కిలో రూ.360 నుంచి రూ.460 పెరగడంతోపాటు సబ్బుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. బియ్యం 48 కిలోల నంద్యాల సోనమసూర్ రూ.3,200, కర్నూలు సోనా రూ.2900 నుంచి రూ.3 వేల దాకా ధరలు పలుకుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం వస్తే నిత్యావసర సరుకుల ధరలు తగ్గుతాయని భావించిన ప్రజలకు ప్రస్తుత ధరలు మింగుడు పడటం లేదు. ఏది కొనాలన్నా ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో త్వరలో వచ్చే దసరా, దీపావళి పండగలకు ఎలా చేసుకోవాలని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు అతిక్రమించి బెల్లం విక్రయాలు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని నల్లమలలో నాటు సారా ఎక్కువ కాస్తారన్న ఉద్దేశంతో బెల్లాన్ని సైతం ఎక్సైజ్ అధికారులు ప్రతి షాపులో రోజుకు ఇన్ని కిలోలు మాత్రమే (దాదాపు 50 కిలోల లోపే) విక్రయించాలన్న నిబంధన పెట్టింది. చక్కెర ధర పెరగడంతో బెల్లం విక్రయాలు ఎక్సైజ్ అధికారుల ఆదేశాలకు విరుద్ధంగా అధికంగానే జరుగుతున్నాయి. ఇక కూరగాయల ధరలు గత వారం కంటే ఈ వారం భారీగా పెరిగాయి. టమాటా కిలో రూ.15 నుంచి రూ.30, మిర్చి రూ.25 నుంచి రూ.40, ఉల్లి రూ.60 దాకా, బెండ, క్యాబేజ్, బంగాళదుంపలు రూ.60 నుంచి రూ.80 దాకా ధరలు పలుకుతున్నాయి.

రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు..

ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో రైతులు పండించిన మిర్చి, టమాటా, ఉల్లి దిగుబడులను రైతుల నుంచి వ్యాపారులు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి మార్కెట్లో మాత్రం వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్లో కూరగాల ధరలు ఆకాశాన్నంటుతున్నా రెక్కల కష్టంతో పండించిన అన్నదాతలకు మాత్రం ఆశించిన లాభాలు చేకూరడం లేదు. ఒక వైపు భారీ వర్షాలు.. మరో వైపు వ్యాపారుల మోసాలకు రైతన్నలు అప్పుల పాలవుతున్నారు.

ధరలను నియంత్రించాలి



సామాన్యులకు అందుబాటులో ధరలను ఉంచాలి. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ పోతే సామాన్యులు, మధ్య తరగతి కుటుంబాలు ఎలా జీవనం గడుపుతారు. నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల జీతం సంపాదించే చిరుద్యోగుల పరిస్థితి ఏమిటి. ఇప్పటికైనా ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి. – వెంకటేశ్వర్లు, ఆత్మకూరు

ధరలను పెంచడం సరికాదు



నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. వీటిని అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రోజురోజుకు ధరలు పెంచడం సమంజసం కాదు. వారపు సంతకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఐదు వస్తువులు కొనాలంటే రూ.500 సరిపోని పరిస్థితి. – దుర్గమ్మ, ఆత్మకూరు

ఆయిల్ ధరలను తగ్గించాలి



కూటమి ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి. సన్‌ఫ్లవర్, పామాయిల్, వేరుశనగ నూనెల ధరలను నియంత్రించాలి. సామాన్యుడు కొనుగోలు చేసేవిధంగా లీటర్ నూనె ధర రూ.70 నుంచి రూ.90 లోపు ఉండేలా చూడాలి. సామాన్యులపై భారంమోపే ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు రాకుండా చూసుకోవాలి. – రణధీర్, సీపీఎం పట్టణ కార్యదర్శి, ఆత్మకూరు

రైతులకు సాగు నీరందించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: శ్రీశైలం బ్యాగ్ వాటర్‌లో సర్వం కోల్పోయిన రైతాంగానికి సాగు నీరు ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు, రఘురామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మల్యాల ఎత్తిపోతల పథకం సందర్శనకు వచ్చిన ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును అడ్డుకుని రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

ఘర్షణ..కేసు నమోదు

నందికొట్కూరు: స్థానిక పగిద్యాల రోడ్డులో ఆదివారం ఇరు వర్గాలు ఘర్షణకు పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గనమల సుబ్బారావు తెలిపారు. డబ్బు పంచాయతీ విషయంలో రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు షేక్షావలి, ఇర్ఫాన్, రాఖిల్, ప్రసాద్, మరో వర్గానికి చెందిన మహమ్మద్ బాషా, కలాంబాషా, ఇమ్రాన్, హుసేన్‌లపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 బాల్ బ్యాడ్మింటన్, రెజ్లింగ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు.

పంట పొలంలో ప్లాట్లు

- నిద్రావస్థలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు



పంట పొలంలో వేసిన ప్లాట్లు

జూపాడుబంగ్లా: పంటపొలంలో ప్లాట్లు వేసి యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిద్రావస్థలో ఉండటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూమిని పంట పొలం నుంచి వ్యవసాయేతర భూమిగా మార్చుకున్న తర్వాతే ప్లాట్లుగా వేసి విక్రయించుకోవాల్సి ఉంది. కానీ మండ్లెం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 289లో కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పంటపొలంలోనే దర్జాగా ప్లాట్లువేసి విక్రయిస్తున్నారు. అయినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ కాకుండా వేసిన ప్లాట్లు విక్రయిస్తే భవిష్యత్‌లో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



గుంతల మయంగా మారిన బీటీ రహదారి

రహదారి ఛిద్రం

- ప్రయాణికులకు ఇక్కట్లు

పాములపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాములపాడు నుంచి చెలిమిల్ల గ్రామానికి వెళ్లే బీటీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దాదాపు 3 కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై అడ్డంగా నీరు ప్రవహించడంతో అక్కడికక్కడా కొట్టుకుపోయింది. చెలిమిల్ల, లింగాల గ్రామాలతోపాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఆయా గ్రామాల నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా భారీ వాహనాల్లో ఎర్రమట్టి తరలింపు కూడా ఈ రహదారి గుండా సాగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతుల మధ్య ఘర్షణ

- ఆరుగురిపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన రైతుల మధ్య సాగు నీరు పారించుకునే విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ విషయంలో రైతులు నవీన్, ఎల్లా పుల్లయ్యలపై ఆదివారం మరో వర్గానికి చెందిన రైతు ఇటుకు శేఖర్‌గౌడు తన బంధువులతో కలిసి దాడిచేసి గాయపరిచినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎల్లా పుల్లయ్య, ఇటుకు శేఖర్‌గౌడు తమ పంట పొలాలకు సాగు నీటిని పారించుకునే విషయంలో నాలుగు రోజుల క్రితం గొడవ పడ్డారు. ఈవిషయం మనసులో పెట్టుకున్న శేఖర్‌గౌడు ఆదివారం ఇంటి ముందు నుంచి వెళ్తున్న ఎల్లా పుల్లయ్య, నవీన్‌లను దుర్భాషలాడుతూ సమీప బంధువులు శంకర్‌గౌడు, నాగేంద్రగౌడు, వెంకటేశ్‌గౌడు, మహేష్‌గౌడు, ధనుంజయగౌడుతో కలిసి కర్రలతో దాడి చేశారు. గాయపడిన నవీన్, ఎల్లా పుల్లయ్యలను నందికొట్కూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించి, వారి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గాయపడిన నవీన్

గుండ్లకమ్మ వాగు పూడిక తీయాలి



మాట్లాడుతున్న సీపీఎం పూర్వపు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రాజశేఖర్

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల రోడ్డు నుంచి దుద్యాల రోడ్డులోని భవనాశి వాగు వరకు ప్రవహించే గుండ్లకమ్మ వాగులో పూడిక తీసి వరదల నుంచి సమీప కాలనీల ప్రజలను కాపాడాలని సీపీఎం పూర్వపు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏకలవ్యనగర్‌లో పార్టీ గరీబ్‌నగర్ శాఖ మహాసభలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మోస్తరుగా వర్షాలు కురిసినా గుండ్లకమ్మ వాగు సమీపంలో ఉన్న హుసేన్‌సాగర్, లక్ష్మీనగర్, పద్మావతినగర్, ఏకలవ్యనగర్, ఇంద్రానగర్, గరీబ్‌నగర్ తదితర కాలనీల ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి కట్టుబట్టలతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుండ్లకమ్మ వాగులో పూడికతీసి ప్రహరీ నిర్మించి ఆయా కాలనీల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం పట్టణ నూతన కార్యదర్శిగా ఎ.సురేంద్రబాబును ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జి.నాగేశ్వరరావు, గోవిందు, తుమ్మలూరు శివకుమార్, వీరన్న, రమణ, రఫీ, సుబ్బయ్య, లైట్ బాషా, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో తాళ్లపాక హరినారాయణ స్వామీజీ

మహానంది: తాళ్లపాక అన్నమాచార్యుల వారి 12వ తరానికి చెందిన హరినారాయణ స్వామి, శిష్యులు ఆదివారం మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి వేద పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు. అనంతరం గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాగా ఆదివారం సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.



మహానందికి వచ్చిన తాళ్లపాక హరినారాయణ స్వామిజీ

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జయరామిరెడ్డి

వెలుగోడు: కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెలుగోడు మండలానికి చెందిన ముక్కమల్ల జయరామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబరుగా బలుసా రాము ఎన్నికయ్యారు. వీరిని ఆదివారం మండలంలోని మెడికల్ షాపుల యజమానులు సత్కరించారు.

ధోబీఘాట్లు నిర్మించాలి

పాములపాడు: గ్రామాల్లో ధోబీ ఘాట్ల నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే గిత్తా సయసూర్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు ధర్మయ్య, రామకృష్ణుడు, రాజు, మద్దిలేటి, గోపాల్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సాములు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అంకన్న ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేశారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: మొక్కజొన్న పంట దిగుబడుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పగిద్యాల రోడ్డులో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులను రైతు సంఘం నాయకులు ఏసన్న, సోమన్న, రామకృష్ణ, సిద్దు, ఖాదర్‌బాషా, బీబీ, సోమప్ప, లింగన్న, అన్వర్, షబ్బీర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారని, క్వింటా రూ.2,800తో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ హిందూధర్మాన్ని కాపాడుకోవాలని హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని తంగడంచ గ్రామంలో ఆదివారం హిందూ ధర్మంపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొదటి నుంచి సనాతన ధర్మంగా హిందూ ధర్మం విరాజిల్లుతోందన్నారు. పాశ్చాత్య పోకడలకు పోయి హిందూధర్మ సంప్రదాయాలను విస్మరించొద్దని సూచించారు.

పోరాట స్ఫూర్తికి ప్రతి రూపం ఏపీటీఎఫ్

నంద్యాల(న్యూటౌన్): పోరాట స్ఫూర్తికి ప్రతి రూపం ఏపీటీఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యా, వైజ్ఞాన మహాసభలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సభలో హృదయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాట సంస్థగా పేరుగాంచిందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ, విద్యారంగ పరిరక్షణకు, సమాజ శ్రేయస్సుకు నిరంతరం పాటుపడటం గర్వించదగ్గ విషయమన్నారు. ఆటంకంగా ఉన్న యాప్‌లను తొలగించి, పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరిగే 20వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, అడక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి బత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

బట్టర్‌ఫ్లై.. బట్టర్‌ఫ్లై





ఈ చిత్రాలను చూస్తే బట్టర్ ఫ్లై.. బట్టర్ ఫ్లై వేరార్ యు గోయింగ్ అనే చిన్నారుల గేయం గుర్తుకు వస్తుంది కదూ! మహానంది సమీపంలోని నల్లమల ప్రకృతి అందాలకు నెలవు. పచ్చందాలతోపాటు జలపాతాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంటాయి. ఆదివారం సీతాకోక చిలుకలు రన్నింగ్ రేస్ పెట్టుకున్నాయా అన్నట్లు వరుసలో నిలబడి ఇసుకల్లో ఆహార అన్వేషణలో నిమగ్నమై ఉన్న దృశ్యాలను ‘సాక్షి’ క్లిక్ మనిపించింది. – మహానంది

గ్రామాల్లో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో యథేచ్ఛగా నాటుసారా విక్రయిస్తున్నా పట్టించుకునేనాథుడు లేకపోవటంతో ప్రజలు వీధుల వెంట తిరిగేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మండ్లెం, తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, కొత్తసిద్దేశ్వరం, రామసముద్రం, 80బన్నూరు, భాస్కరాపురం, పి.లింగాపురం గ్రామాల్లో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు జరుగుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. నందికొట్కూరు, మిట్టకందాల తదితర ప్రాంతాల నుంచి నాటుసారా ప్యాకెట్లు తయారుచేసుకొని వచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు కూరగాయలు తీసుకొని వెళ్లే సంచుల్లో నాటుసారా ప్యాకెట్లు వేసుకొని వచ్చి విక్రయిస్తున్నారు. గిరాకీని బట్టి ఓ నాటుసారా ప్యాకెట్ రూ.20 నుంచి రూ.50 దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఉదయమంతా పొలం పనులు చేసొచ్చి అలసిపోయిన మద్యం ప్రియులు సాయంత్రం కాగానే సుదూరంలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి అధిక ధరలు వెచ్చించి మద్యం కొనుగోలు చేయలేక గ్రామాల్లో తక్కువ ధరకు లభిస్తున్న నాటుసారా తాగటం అలవర్చుకున్నారు. కొంత మంది నాటుసారా విక్రయదారులు నివాసగృహాల మధ్యన విక్రయాలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాటుసారా తాగి ఇళ్లముందే ప్యాకెట్లు వేస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కొత్తసిద్దేశ్వరం గ్రామంలో పక్షం రోజుల క్రితం వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గ్రామాల్లో అక్రమ నాటుసారా విక్రయాలను అరికట్టాల్సిన అధికారులు తమకు తగినంత సిబ్బందిలేరనే నెపంతో గ్రామాల్లో నాటుసారా విక్రయాల నివారణను పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల్లో నాటుసారా విక్రయాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు

బండిఆత్మకూరు: కడమల కాలువ పొలిమేరలోని తెలుగుగంగ ప్రాంతం నుంచి నిత్యం ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు మట్టి తవ్వకాలే ప్రధాన వ్యాపారంగా చేసుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీలను సీజ్ చేసి, మట్టి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మట్టి

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

జూపాడుబంగ్లా: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసును 80 బన్నూరు చెంచులు కోరారు. ఆదివారం ఆర్డీఓ 80 బన్నూరు చెంచుకాలనీని పరిశీలించి వారి సమస్యలు తెలుసుకున్నారు. చాలీచాలని స్థలంలోనే 20 ఏళ్లుగా తమ కుటుంబీకుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, సమస్యను గుర్తించి శ్మశానికి ఎకరా స్థలం కేటాయించాలని చెంచులు కోరారు. అలాగే ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని చెంచు సంఘం నాయకుడు పుల్లన్న, సీపీఐ నాయకుడు రమేష్ ఆర్డీఓను కోరారు.



ఆర్డీఓకు సమస్యలు విన్నవిస్తున్న చెంచులు

కేసీ కాల్వలో తగ్గిన నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: తుంగభద్ర డ్యాం నుంచి సుంకేసుల డ్యాంలోకి వరదనీటి ప్రవాహం తగ్గటంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరాను తగ్గించినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాంలోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో లేనందున డ్యాంలో 1.2 టీఎంసీ నీటిమట్టం ఉందన్నారు. డ్యాం నుంచి కేసీ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 415 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఇందులో తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 315 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిప్పుల వాగుకు నీటి సరఫరా నిలిపేసినట్లు తెలిపారు. ఇప్పటిదాక కేవలం వరద జలాలను మాత్రమే కేసీ కాల్వకు సరఫరా చేశామని, కేసీ నీటి వాటాను వినియోగించుకోలేదని ఆయన తెలిపారు.



కేసీ కాల్వలో భారీగా తగ్గిన నీటి సరఫరా